

ఊరెళ్తున్నారా.. ఊడ్చేస్తారు!

● దసరా సెలవుల వేళ జర జాగ్రత్త

న్యూస్‌టుడే, మంచిర్యాలనేరవిభాగం

పండగ కోసం సొంతూళ్లకు వెళ్లాలను కుంటున్నారా.. అయితే జాగ్రత్త. మీరలా వెళ్లి.. ఇలా వచ్చేసరికి ఇల్లు గుల్ల అయ్యే ప్రమాదముంది. ఎందుకంటే దసరా సెలవుల్లో తాళాలు వేసి ఉన్న నివాసాలే దొంగల లక్ష్యం. రాత్రి సమయాల్లో ఎవరికి కనిపించకుండా దొంగలు వస్తారని అందరూ అనుకుంటారు. కానీ పట్టణ ప్రాంతాల్లో పక్కింటి వారు ఉన్నారో లేరో అనే సంబంధం లేకుండా ఒకరికొకరు వ్యవహరిస్తుంటారు. దీంతో కాలనీల్లో దొంగలు యథేచ్ఛగా సంచరిస్తూ ఏ ఇంటికి తాళం ఉందో గమనించి చోరీలకు పాల్పడుతున్నారు. సెలవుల్లో వారం రోజుల పాటు చాలా మంది సొంత ఊళ్లకు, విహారయాత్రలు, పుణ్యక్షేత్రాలకు వెళ్తుంటారు. ఇతర సమయాలతో పోలిస్తే జిల్లాలో సెలవు రోజుల్లో దొంగతనాలు 30 శాతం అధికంగా నమోదవుతున్నట్లు పోలీసులు హెచ్చరిస్తున్నారు.

తాళం వేసిన ఇళ్లే లక్ష్యం

అంతర్రాష్ట్ర దొంగలు, ఇతర జిల్లాలకు చెందిన చోరులు కూలీ పనులు, వివిధ వస్తువులు అమ్ముతున్నట్లు జిల్లాకు వచ్చి అనువైన ప్రాంతాన్ని ఎంచుకుంటున్నారు. ఎక్కువగా శివారు ప్రాంతాలు, కాలనీల్లో తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఉదయం రెక్కీ నిర్వహించి, రాత్రి దోపిడీలకు పాల్పడుతున్నారు.

జనవరి నుంచి ఇప్పటి వరకు జరిగిన చోరీలు	
మంచిర్యాల:	266
ఆదిలాబాద్:	243
ఆసిఫాబాద్:	180



పోలీసులు నిఘా పెంచాలి..

మామూలు రోజులతో పోలిస్తే వేసవిలో రాత్రి పూట పెట్రోలింగ్ పెంచాలి. ప్రత్యేక నేర బృందాలు పాత నేరస్థులను గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వాలి. జైలు నుంచి విడుదలైన పాత నేరస్థుల కదలికలపై నిఘా ఉంచాలి.

పోలీసు అధికారుల సూచనలు



◆ ఊరెళ్లాల్సి వస్తే విలువైన బంగారం, వెండి ఆభరణాలు, డబ్బులను బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలి.



◆ కాలనీలో అనుమానాస్పదంగా, గుర్తుతెలియని వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు ఫోన్ చేయాలి.

◆ ఊరికి వెళ్లే ముందు తమ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి.



◆ ఇంటికి సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సార్, సెంట్రల్ లాక్ సిస్టమ్ అమర్చుకోవాలి.

◆ వాహనాలను ఆరుబయట కాకుండా ఇంటి ఆవరణలో నిలపాలి.



◆ ఇంట్లో చీకటి ఉండకుండా విద్యుత్తు దీపాలు వెలిగి ఉంచాలి.

◆ అపార్ట్‌మెంట్‌ల వద్ద నమ్మకమైన వాచ్‌మెన్‌ను నియమించుకోవాలి.



◆ ఊరెళ్తున్న విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో పంచుకోరాదు.


◆ కాలనీల్లో స్వచ్ఛంద కమిటీలు ఏర్పాటు చేసుకోవాలి. పోలీసులకు అందుబాటులో ఉండాలి.

నిఘా నేత్రాలు ఏర్పాటు చేసుకోవాలి



సాధారణంగా తాళం వేసిన ఇళ్లనే దొంగలు లక్ష్యంగా చేసుకుంటారు. ఊరెళ్లాల్సి వచ్చినప్పుడు చుట్టుపక్కల వారితో పాటు పోలీసులకు సమాచారం ఇవ్వాలి. గస్తీలో పెట్రోలింగ్‌కు వచ్చే పోలీసులు ఊళ్లోలేని ఇళ్లపై ప్రత్యేక నిఘా ఉంచుతారు. నిఘా నేత్రాలను ఏర్పాటు చేసుకుంటే రూ.లక్షల విలువైన వస్తువులతో పాటు నగదును కాపాడుకోవచ్చు.

- శ్రీనివాస్, రామగుండం పోలీసు కమిషనర్




సార్వత్రిక పరీక్షకు 61 మంది గైర్హాజరు

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే : తెలంగాణ సార్వత్రిక పది, ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని 3 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం జరిగిన పదోతరగతి పరీక్షకు 67 మంది విద్యార్థులకు గాను 36 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ఇంటర్ పరీక్షకు 114 మంది విద్యార్థులకుగాను 84 మంది పరీక్ష రాశారు. జిల్లా పరిషత్ బాలురు, బాలికల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాలను డీఈవో యాదయ్య పరిశీలించారు.

వారు వదలరు.. వీరు కదలరు

● కబ్జా కోరల్లో పోచమ్మ చెరువు



బెల్లంపల్లిలోని పోచమ్మ చెరువుకు పక్కన వేసిన కంచె

న్యూస్‌టుడే, బెల్లంపల్లి పట్టణం

చెట్టు, చేమ, చెరువు ఇవన్నీ ప్రకృతి ఇచ్చిన వరాలు. ప్రకృతిని సైతం తమ గుప్పిట్లోకి తీసుకుంటున్నారు అక్రమార్కులు. హైదరాబాద్‌లో ఓ వైపు హైడ్రా చెరువులను చెరపట్టి నిర్మించిన నిర్మాణాలను కూల్చేస్తుంటే కనీసం అధికార యంత్రాంగం బెల్లంపల్లిలో కదలడం లేదు. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాల్లోనూ హైడ్రాలా పనిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. బెల్లంపల్లిలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. బెల్లంపల్లిలోని పోచమ్మ చెరువు (మినీ ట్యాంక్ బండ్), ఎర్ర కుంట చెరువు చుట్టూ అడ్డగోలుగా ఆక్రమణలు కొనసాగుతుంటే రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు ఇటువైపు చూడటం లేదు. గతంలో ఆర్డీఓ హరికృష్ణ చెరువును పరిశీలించారు. అయినప్పటికీ కనీసం అక్కడ వేసిన కంచెను సైతం తొలగించలేకపోయారు. ప్రస్తుత ఎమ్మెల్యే గడ్డం వినోద్ పోచమ్మ చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ఆక్రమణలు ఆందోళన కలిగిస్తున్నాయి.

నీటిపారుదల శాఖ ఆధీనంలో ..

సింగరేణి గనులు ఉన్న సమయంలో బెల్లంపల్లిలోని పోచమ్మ చెరువు నీళ్లను విద్యుదుత్పత్తి కోసం వినియోగించారు. గనుల మూతతో కాలక్రమేణా పోచమ్మ చెరువు నీటిపారుదల శాఖ ఆధీనంలోకి వచ్చింది. మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం సమయంలోనే నీటిపారుదల శాఖ తన ఆధీనంలోకి తీసుకుంది. గురజాల రోడ్డులో ఎర్ర కుంట చెరువు దాని నుంచి చిన్న చెరువుకు అక్కడి నుంచి పెద్ద చెరువుకు నీళ్లు పైపుల ద్వారా వస్తుంటాయి. పోచమ్మ చెరువు గొలుసు చెరువుగా ప్రసిద్ధిగాంచింది. ఎర్ర కుంట చెరువు చుట్టూ ఆక్రమణలు పెరిగిపోయాయి. మట్టి తవ్వకాలు ఇక్కడ జోరుగా కొనసాగుతుంటాయి. అధికారులు స్పందించి పోచమ్మ చెరువును హైడ్రా తరహాలో కాపాడతారో అక్రమార్కులకు వంత పాడతారో వేచిచూడాలి.

శిఖం భూమిపై కన్ను

పట్టణంలోని సింగరేణి, ప్రభుత్వ భూములను కాజేస్తున్న అక్రమార్కులు ఊహకందని విధంగా ఎర్రకుంట శిఖం భూములపై కన్నేశారు. అధికారులు కబ్జాల పర్వాన్ని చోద్యం చూడటం తప్ప ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. శ్మశాన వాటికను ఆనుకుని ఎకరం భూమిని ఇప్పటికే కబ్జా చేసి ఫెన్సింగ్ వేశారు. పట్టణంలో కబ్జాల తీరు నిత్యకృత్యంలా మారింది. గతంలో మామిడి మొక్కలు నాటిన శిఖం భూమిని సీఓఈ కళాశాలకు ఇవ్వాలని అప్పటి కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ నిర్ణయించారు. ఆ తర్వాత ఆయన బదిలీ అనంతరం శిఖం భూమి అలాగే ఉండిపోయింది. ప్రస్తుతానికి శిఖం భూమి కబ్జా చేయడం వెనుక కొంతమంది రాజకీయ నాయకులు ఉన్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చెరువును ఆనుకుని ఉన్న శిఖం భూమి చుట్టూ సిమెంట్ స్తంభాలతో కంచె వేశారు. చెరువుకు సమీపంలోనే ఐటీడీఏ శిక్షణ కేంద్రం భవనం, సీఓఈ కళాశాల ఉన్నాయి. దాదాపుగా వీటి దగ్గర వరకు చెరువు నీళ్లు ఉంటాయి.

డిజిటల్ సర్వే వేగవంతంగా పూర్తి చేయాలి

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే : జిల్లాలో చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్ట్ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంచిర్యాలలో వార్డు నెం.16, అశోక్‌రోడ్డులో శుక్రవారం నిర్వహించిన సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఒక్కొక్క మున్సిపాలిటీలో ఒక వార్డు, ఒక గ్రామం చొప్పున ఎంపిక చేసి డిజిటల్ కార్డులు ఇవ్వడానికి సర్వే చేయిస్తున్నామని తెలిపారు. ఈ సర్వేను 9వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, మేనేజర్ విజయ్‌కుమార్, ఆర్.ఓ. శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

భాషపై పట్టు.. మార్కులు కొట్టు

● తప్పులు లేకుండా రాయడం.. వ్యాకరణ అంశాలపై అవగాహన అవసరం


దండేపల్లి, న్యూస్‌టుడే

పదో తరగతి పరీక్షలకు మరో అయిదు నెలల సమయం ఉన్నా.. ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. చాలా మంది విద్యార్థులు ఆప్షనల్ సబ్జెక్టులను బాగా సాధన చేస్తూ భాష విషయాలను పట్టించుకోరు. దీంతో జీపీఏ తగ్గే అవకాశముంది. మంచి జీపీఏ సాధించాలంటే అన్ని సబ్జెక్టులపై అవగాహన కలిగి ఉండాలి. ఈ నేపథ్యంలో తెలుగు, హిందీ, ఆంగ్లం ఉపాధ్యాయులు అందజేస్తున్న సూచనలు ఇలా...



వ్యాకరణం.. పద్యసాధనతో ఉత్తమ ఫలితం

తెలుగు..



చుక్క గుర్తు పెట్టిన పద్యాలు రాసి వాటి భావాలు, ప్రతిపదార్థం, కవి పరిచయం, రచనాశైలిపై అవగాహన పెంచుకోవాలి. పాదభంగం లేకుండా పద్యం పూరించి భావం రాస్తే ఐదు మార్కులు ఖాయం.

◆ పద్య, గద్య ఉపవాచకాల నుంచి 6 వ్యాసరూప ప్రశ్నలుంటాయి. ఛాయిస్ పోనూ మూడింటికి సమాధానం రాస్తే 21 మార్కులు వస్తాయి. కథానిక, కథ, కవిత, గేయం, పాట, ఆహ్వానపత్రం, ముఖాముఖి ప్రశ్నావళి, అభినందన పత్రం, నాటకం, నాటిక, సంభాషణ, ప్రకటనలు, కరపత్రం తయారు చేయడంపై పట్టు సాధిస్తే ఏడు మార్కులు సాధిస్తారు..

◆ పదజాలం, సంధులు, సమాసాలు, అలంకారాలు, గణవిభజన, వాక్యాలను సాధన చేయాలి.

◆ పద్య భాగంలోని బిక్ష, దానశీలం, శతక మధురిమ పాఠ్యాంశాల నుంచి ఎక్కువ ప్రశ్నలు అడిగే అవకాశముంది.

◆ అపరిచిత (పుస్తకంలో లేనిది) పద్యం, గద్యం ఇచ్చి దీని కిందనే ప్రశ్నలు ఉంటాయి. వీటిని అవగాహన చేసుకుని జవాబులు రాస్తే పది మార్కులు వస్తాయి.

◆ తెలుగులో దస్తూరి బాగుండటంతో పాటు అక్షర దోషాలు లేకుండా రాయగలగాలి.



బి.హరిచరణ్, తెలుగు భాషోపాధ్యాయుడు, ఉన్నత పాఠశాల తేజాపూర్, ఆదిలాబాద్ జిల్లా

భాషపై అవగాహన ముఖ్యం

హిందీ..

పఠిత, అపఠిత గద్యాంశాలు, పద్యాంశాలు నేర్చుకుంటే 20 మార్కులు వస్తాయి. వ్యాకరణంలో భాషాభాగాలు, వ్యతిరేక పదాలు, సమానార్థాలు, వచన్, ఉపసర్గ్, ప్రత్యయ్, పునరుక్తి శబ్దాలు, మహావరాల నుంచి 20 మార్కులు. పద్య, గద్య భాగాలలోని ముఖ్యమైన పాఠ్యాంశాల సారాంశాలను సొంత మాటల్లో రాసేలా అభ్యాసం చేయాలి. ఉపవాచకంలోని గద్యాంశాలపై దృష్టి పెడితే మంచి మార్కులు వస్తాయి. ప్రతి పాఠంలోని కవి పరిచయాల సాధన తప్పనిసరి.

◆ పాదభంగం లేకుండా చూడాలి. డైరీ, పోస్టర్, సంవాదం, సూచన, లేఖలు, కరపత్రం తయారీ, నిబంధ్ పై సాధన చేయాలి.



కె.వామన్‌రావు, హిందీ ఉపాధ్యాయుడు, జైనూర్ ఉన్నత పాఠశాల కుమురం భీం జిల్లా

పదజాలంపై పై దృష్టి సారించాలి

ఆంగ్లం..



ప్రశ్నపత్రం పార్ట్ ఏ, బీ విభాగాలుగా ఉంటుంది. 'ఏ'లో రెండు మైనర్ డిస్కోర్స్‌లు, ఒక మేజర్ డిస్కోర్స్ ఉంటాయి. మైనర్‌లో మెసేజ్‌లు, డైరీ, నోటీస్‌లు, పోస్టర్, ఇన్విటేషన్, ప్రొఫైల్ ఉంటాయి. వీటిని సాధన చేస్తే పది మార్కులు వస్తాయి. మేజర్‌లో లేఖలు, బయోగ్రఫీ, కొరియోగ్రఫీ, కన్వర్షేషన్, న్యూస్ రిపోర్ట్, ఇంటర్వ్యూ, తదితర అంశాలు ఉంటాయి. వీటిని సాధన చేస్తే 10 మార్కులు.. అంటే మొత్తం కలిపి 20 మార్కులు వచ్చినట్టే. అదే విధంగా రెండు ప్యాసేజీలు ఉంటాయి. వీటిని చదివి ప్రశ్నలకు జవాబులు రాస్తే 24 మార్కులతో మొత్తం పార్ట్ ఏలో 60 మార్కులుంటాయి.

◆ పార్ట్ బిలో వ్యాకరణం, ఎడిటింగ్, తప్పులను సవరించడం (కరెక్టింగ్ ఎర్రర్స్), పద్యం చదివి ప్రశ్నలకు సమాధానాలు రాస్తే పది మార్కులు సాధించవచ్చు. పుస్తకంలో లేని ప్యాసేజీ ఇచ్చి దీనిని చదివి మల్టీపుల్ ఛాయిస్‌లో ప్రశ్నలుంటాయి. వీటికి 20 మార్కులుంటాయి.

◆ వ్యాకరణం, తప్పులు లేకుండా రాయడం, ప్యాసేజీలు అవగాహన చేసుకుని జవాబులు రాస్తే మంచి జీపీఏ సాధించవచ్చు.




రమాబిందు, ఆంగ్ల ఉపాధ్యాయురాలు, వెల్గనూర్ ఉన్నత పాఠశాల, మంచిర్యాల జిల్లా



మహ్మద్‌ఖాసీంబస్తీకి వెళ్లే దారిలో అడ్డంగా ఆటోలు

దారిపై నిలిపి.. అవస్థలు పెంచి

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్నాయి. పాతబస్టాండ్ నుంచి కాంటాచౌరస్తా వరకు నిత్యం రద్దీగా ఉంటుంది. పోలీసులు పదేపదే పెట్రోలింగ్ చేస్తున్న వారు వెళ్లిన తర్వాత మళ్లీ ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్టీసీ బస్సులు ఆగే స్థలంలో పదుల సంఖ్యలో ఆటోలు అక్కడే ఉండడంతో సమస్య ఎదురవుతోంది. బస్సులు ఆపే చోట ఆటోలు నిలిపి ఉంచుతున్నారు. ఈ సమయంలో ఆర్టీసీ బస్సులు నడిరోడ్డు మీద ఆపాల్సి వస్తుంది. వెనకాల వచ్చే ప్రయాణికులు చికాకు పడాల్సి వస్తుంది. కాంటాచౌరస్తాలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటుంది. రోడ్లపైనే చాలాసేపు ఆటోలను నిలిపి ఉంచడం ప్రజలకు ఇబ్బందిగా మారుతుంది. ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



దండేపల్లిలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

దండేపల్లి, లక్షెట్టిపేట, న్యూస్‌టుడే : వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. ఆయన శుక్రవారం దండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, కస్తూర్బా విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో రిజిస్టర్లు పరిశీలించారు. రోజుకు ఎంత మంది రోగులు వస్తున్నారు.. వైద్యం ఎలా అందుతుంది.. మందులు ఉన్నాయా? అంటూ ఆరా తీశారు. వైద్య సేవల తీరును రోగులను అడిగి తెలుసుకున్నారు. కస్తూర్బాలో నిర్మిస్తున్న గదులు దసరా సెలవుల లోపు పూర్తి చేయాలన్నారు. ఎంపీడీఓ ప్రసాద్, వైద్యాధికారి సతీష్, ఎస్ఓ మంజుల పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు వెంకట్రావుపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. కాలానుగుణ వ్యాధుల నేపథ్యంలో అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని వైద్యులకు సూచించారు.

ధ్రువపత్రాల పరిశీలనకు నేడే తుది గడువు

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే : జిల్లాలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి డీఎస్సీ-2024 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతోంది. జిల్లా కేంద్రంలోని కార్మల్ కాన్వెంట్ స్కూల్‌లో నాలుగు రోజులుగా ప్రక్రియను జిల్లా విద్యాశాఖ అధికారులు చేపడుతున్నారు. 288 పోస్టులకు సంబంధించి 1:3 నిష్పత్తి ప్రకారం ఎంపికైనవారు, చరవాణులు, మెయిల్‌కు సందేశాలు వచ్చిన వారు పరిశీలనకు హాజరవుతున్నారు. శుక్రవారం వరకు 595 మంది అభ్యర్థుల పరిశీలన పూర్తయినట్టు అధికారులు తెలిపారు. ఇంకా 120 మంది హాజరుకావాల్సి ఉందన్నారు. శనివారం ఒక్క రోజే అవకాశం ఉందని సందేశాలు వచ్చిన అభ్యర్థులు తమ వివరాలతో పరిశీలన కేంద్రానికి హాజరుకావాలని డీఈవో యాదయ్య పేర్కొన్నారు.

పత్తి పంటలో మానసిక ఒత్తిడి

● వాతావరణ సమతుల్యత లోపమే ప్రధాన కారణం

ఆధునిక సమాజంలో మనిషి ఎదుగుదలతో పాటు మానసిక ఒత్తిడి పెరుగుతోంది. దాన్ని అధిగమిస్తే తప్ప నిలదొక్కుకోవటం కష్టమవుతోంది. ఇది మనుషులకే కాదు చేలోని పంటల్లోనూ కనిపిస్తోంది. ప్రధానంగా 45 రోజుల దశకు చేరుకునే పత్తి పంటలోనూ మానసిక ఒత్తిడి పెరుగుతోంది. పసిగట్టి నివారించాల్సి వైద్యుడు రైతే. పత్తి పంటకు మానసిక ఒత్తిడా? అనేది నమ్మశక్యంగా లేదు. కానీ నమ్మితీరాల్సిందే అంటున్నారు వ్యవసాయ శాస్త్రవేత్తలు. ఇంతకీ పత్తి పంటలోని మానసిక ఒత్తిడికి కారణాలేమిటి? నివారణ ఏమిటి? అనేదానిపై ఆదిలాబాద్ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా. రాంప్రసాద్‌తో 'ఈటీవీ-ఈనాడు' ప్రత్యేక ముఖాముఖి.





కుంగుబాటుకు గురైన పత్తిని చూపిస్తున్న శాస్త్రవేత్త రాంప్రసాద్

వ్యవసాయ ప్రధాన శాస్త్రవేత్తతో 'ఈటీవీ-ఈనాడు'



ఈటీవీ – ఆదిలాబాద్

ఈ : సహజంగా మనిషిలో ఉండే మానసిక ఒత్తిడి పత్తి పంటలోనూ ఉంటుందనేది కొత్తగా వినిపిస్తోంది. నిజమేనా? దానికి కారణాలేమిటి?

రాంప్రసాద్ : ముమ్మాటికీ నిజమే. ప్రాణమున్న అన్ని జీవుల మాదిరిగా పంటల్లోనూ మానసిక ఒత్తిడి ఉంటుంది. ప్రధానంగా పత్తిలో స్పష్టంగా కనిపిస్తోంది. యవ్వన, వృద్ధాప్య దశలో వివిధ సమస్యలతో బాధపడే మనుషుల్లో కుంగుబాటుకు గురైనట్లే పత్తిపంట 40 రోజుల దశదాటిన తర్వాత రెండు రకాల ఒత్తిళ్లకు గురవుతుంది. అందులో మొదటిది అధిక వర్షపాతంతో ఊపిరాడకుండా గురయ్యే ఒత్తిడైతే, నీటి ఎద్దడి కారణంగా పోషకాలు లభించకుండా కుంగుబాటుకు గురయ్యే ఒత్తిడి రెండోది.

ఈ : మనుషులైతే తమ బాధలు, సమస్యలను వైద్యులకో, స్నేహితులకో వివరించి ఉపశమనం పొందవచ్చు. పత్తి పంట తన బాధను ఎలా వివరిస్తుంది. మనం ఎలా పసిగట్టవచ్చు?

రాం : మీరనేది నిజమే! మనుషులు తమ బాధలను మాటల ద్వారా వెల్లడిస్తారు. కుంగుబాటుకు గురయ్యే పత్తి పంట కూడా నేను ఒత్తిడిలో ఉన్నానని సాగుచేసే రైతులకు పెరుగుదల రూపంలో సంకేతం ఇస్తుంది. అదెలాగంటే నీరు ఎక్కువైనా, తక్కువైనా ఏపుగా పెరిగిన మొక్కలు సాయంత్రం తర్వాత మోడువారినట్లు కనిపిస్తాయి. గాలివీచినా కదిలినట్లుగా అనిపించవు. ఆకులు తలవాల్చి వడలిపోయినట్లు ఉంటాయి. క్రమంగా పూత, కాత రాలిపోతుంది. జీవంలేని మొక్కలుగా మారుతాయి. ఇవన్నీ ఇతరులకు తెలియకపోవచ్చు. రైతులకు తెలిసిన అంశాలే.

ఈ : కుంగుబాటుకు గురైన పత్తి పంటను ఎలా కాపాడుకోవచ్చు?

రాం : వ్యవసాయం చేసే ప్రతి రైతు పంటల యోగక్షేమాలను గుర్తించగలిగే వైద్యుడే. పత్తి పంటనే కాదు. ఏ పంటలో ఏ మార్పు వచ్చిందో? ఏం చేయాలో? ఎలా రక్షించుకోవాలో తెలిసిన జ్ఞానే. మేం చెప్పే సూచనల ప్రకారమైతే చేలోని పంటలకు అధిక నీటి నిల్వతో ఇబ్బంది లేకుండా చూసుకోవాలి. కాస్తంత తడి ఉండేలా చూసి ప్రతి 20 రోజులకోసారి ఎకరాకు 20 నుంచి 25 కిలోల యూరియా, 10 నుంచి 15 కిలోల పొటాష్‌ను మొక్క నేలభాగంలో వేయాలి. పూత, కాత రాలకుండా 10 రోజులకోసారి 13-0-45(పొటాషియం నైట్రేట్) పొడిని లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున తెగుళ్లు, పురుగు మందులతో కలిపి పిచికారీ చేయాలి. ఇలా చేయటం ద్వారా పంటలను మానసిక ఒత్తిళ్ల నుంచి కాపాడుకోవటానికి దోహదం చేస్తుంది.

ఈ : ఇప్పుడున్న పంటల పరిస్థితి ఎలా ఉంది? మొక్కలు ఒత్తిళ్లకు గురికాకుండా రైతుకు దిగుబడులు తగ్గకుండా ఏం చేయాలి?

రాం : పత్తి పంట అంటే పసికందును సాకినట్లే. ప్రస్తుతం 90 రోజుల దశలో ఉన్న పంటను 140 రోజుల వరకు కాపాడుకోవాల్సిందే. మొక్కలు కుంగుబాటుకు గురికాకుండా క్రమం తప్పకుండా పోషకాలు అందిస్తే అనుకున్న దిగుబడి సాధించవచ్చు. మరో 10, 15 రోజుల్లో ఒకటి, రెండు వర్షాలు కురిస్తే బాగుంటుంది.



శిక్షణ అనంతరం ప్రశంసాపత్రాలు అందజేసిన పోలీసు డ్రైవర్లతో సీపీ శ్రీనివాస్


ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలు దూరం

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే : ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరు పాటిస్తే ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న డ్రైవర్లు, జనరల్ డ్యూటీ, బీడీ టీమ్, ఏఎస్ఓగా విధులు నిర్వహిస్తున్న 200 మందికి శిక్షణ ఇచ్చారు. సీపీ మాట్లాడుతూ.. చిన్న నిర్లక్ష్యమే కుటుంబాల భవిష్యత్తును రోడ్డున పడేస్తుందన్నారు. సిబ్బంది ఆరోగ్యంపై వ్యక్తిగత శ్రద్ధ పాటించాలని సూచించారు. డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో చరవాణుల్లో మాట్లాడరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా పోలీస్ ప్రతిష్ఠతకు భంగం కలిగేలా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం డ్రైవర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అదనపు డీసీపీ అడ్మిన్‌రాజు, స్పెషల్ బ్రాంచి ఏసీపీ రాఘవేంద్రరావు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, ఒకటో పట్టణ ఎస్‌హెచ్ఓ దేవయ్య పాల్గొన్నారు.


మామడ మండలం నల్దుర్తి అటవీ ప్రాంతంలో పక్షులను వీక్షిస్తున్న అధికారులు


ఆకట్టుకునే అందం వెంగన్న చెరువు సొంతం


జపం చేస్తున్నట్లు..


దీర్ఘాలోచనలో..


రామసక్కని చిలుకలు




కొనితెచ్చి పెట్టిన బొమ్మ కాదండోయ్.. నల్దుర్తి అడవిలో కనిపించిన పక్షి


ఆకాశంలో విహరిస్తూ..

విహంగాల అందం.. అడవితో అనుబంధం

అటవీశాఖ ఆధ్వర్యంలో 70వ వన్యప్రాణి వారోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఆ శాఖ అధికారులు మామడ మండలం నల్దుర్తి అటవీ ప్రాంతంలోని రెండు పురాతన చెరువుల పరిధిలో పర్యటించారు. అధునాతన కెమెరాలతో పక్షులను వీక్షించారు. ఆ అటవీ ప్రాంతంలోని తుర్రం, వెంగన్న చెరువు ప్రాంతాలకు వలస వచ్చే పలు రకాల పక్షులు, ఆవాస వ్యవస్థలో వాటి పాత్ర వంటి వాటిపై అధికారులు సిబ్బందికి అవగాహన కల్పించారు. వారు కెమెరాలో బంధించిన చిత్రాలను చూస్తే మన దగ్గర ఇంత అందమైన పక్షులున్నాయా? అని ఆశ్చర్యపోతాం. అటవీ క్షేత్రాధికారులు రామకృష్ణ, శ్రీనివాస్‌రావు, వేణు గోపాల్, ఉప అటవీ క్షేత్రాధికారి నజీర్‌ఖాన్, మామడ, దిమ్మదుర్తి రేంజ్‌ల సిబ్బంది ఉన్నారు.

- న్యూస్‌టుడే, మామడ


దసరాకు ముందే పాలపిట్ట వచ్చేసింది

పసిపాప ఆకలి తీర్చేందుకు
6 కిలోమీటర్ల కాలినడక


● బేల మండలంలో దయనీయ పరిస్థితి..


పసిపాపకు డబ్బా పాలు తాగిస్తున్న కొడప మోతుబాయి


సాంగ్వి నుంచి పాల డబ్బాను తీసుకొస్తున్న అమ్మమ్మ కొడప లచ్చుబాయి

పుట్టిన 23 రోజులకే తల్లిని కోల్పోయిన పసిపాపను బతికించుకునేందుకు అమ్మమ్మ, అమ్మమ్మ అత్తయ్యలు పడరాని పాట్లు పడుతున్నారు. పసిపాప ఆకలి తీర్చేందుకు పాల డబ్బా కోసం గూడెం నుంచి రానుపోను 6 కి.మీ. దూరం ప్రయాణిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా బేల మండలం దుబ్బగూడ పంచాయతీ బెంబిరిగూడకు చెందిన దేశ్‌ముఖ్ మారుబాయికి ఆగస్టు 20న సొంత గ్రామంలో ప్రసవమైంది. ఆడబిడ్డకు జన్మనిచ్చింది. సెప్టెంబరు 10న అనారోగ్యానికి గురికావడంతో భర్త దేశ్‌ముఖ్ అభ్య, గ్రామస్థులు ఆదిలాబాద్ రిమ్స్‌కు తీసుకెళ్లారు. వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మారుబాయి సెప్టెంబరు 13న మృతి చెందినట్లు భర్త తెలిపారు. హైదరాబాద్ నుంచి రూ.12 వేలు ఖర్చు చేసి శవాన్ని తీసుకొచ్చామని, అదే రోజు ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా రూ.20 వేల ఆర్థిక సాయం అందించారని అన్నారు. భార్య మృతి విషయం తెలిసిన అభిమన్యూ వాట్సాప్ గ్రుపు నిర్వాహకుడు మెస్రం శేఖర్‌బాబు పాప పాల కోసం రూ.30 వేలు అందజేశారు. మూడు రోజులకు ఒకసారి రూ.280 పాల డబ్బా కొనుగోలు చేసి పాలు తాగిస్తూ పాపను బతికించుకుంటున్నామని అమ్మమ్మ లచ్చుబాయి అన్నారు. పాప పాల డబ్బా కోసం బెంబిరిగూడ నుంచి సాంగ్వి వరకు మూడు రోజులకు ఒకసారి రానుపోను 6 కి.మీ. దూరం కాలినడకన వాగు దాటి వెళ్తున్నామని అన్నారు. పాల డబ్బా కోసం వెళ్లిన సమయంలో వచ్చే వరకు తన అత్తమ్మ కొడప మోతుబాయి ఆలనాపాలనా చూసుకుంటోందన్నారు. ప్రభుత్వం, దాతలు స్పందించి పాలిచ్చే ఆవును ఇస్తే పాప కష్టాలు తీరుతాయని వృద్ధులు వేడుకుంటున్నారు.

- న్యూస్‌టుడే - ఇంద్రవెల్లి, బేల



బ్రహ్మచారిణి రూపంలో బాసర అమ్మవారి దర్శనం

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర అమ్మవారి ఆలయంలో రెండు రోజుల కిందట ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం కొనసాగాయి. రెండో రోజు బ్రహ్మచారిణి రూపంలో అమ్మవారు దర్శనమిచ్చారు. తెలుగు రాష్ట్రాలతోపాటు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి సన్నిధిలో దీక్షలు తీసుకున్న వారందరూ మధ్యాహ్నం ప్రత్యేక పూజలు చేశారు.

కార్మిక సంఘాల నాయకుల వాగ్వాదం

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: మందమర్రి కళ్యాణిఖనిలో ఉపరితల గనిలో శుక్రవారం నిర్వహించిన ద్వార సమావేశంలో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాల నాయకులు వాగ్వాదానికి దిగడం చర్చనీయాంశమైంది. గనిలో మొదటి షిఫ్ట్‌లో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ద్వార సమావేశంలో ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య మాట్లాడుతూ ఏఐటీయూసీపై విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలో ఏఐటీయూసీ నాయకులు అడ్డుకుని గొడవకు దిగారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం కాస్త ఉద్రిక్తతకు దారి తీసింది.

పూల పరిమళం.. ఆరోగ్యదాయకం

● బతుకమ్మలో దాగున్న శాస్త్రీయత





బతుకమ్మ పూలు ఇవే..

ఈ సీజన్‌లో బంతి, చామంతి, తామర, అల్లి, గడ్డిపువ్వు, వామపువ్వు, కట్ల, టేకు, స్వస్తికం, సీతజడలు, మందార, తంగేడు, బీర, కాకర, గునుగు, గుమ్మడి, దోస, తదితర పూలు వికసిస్తాయి.

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ సాంస్కృతికం : ప్రకృతి ప్రసాదించిన బతుకమ్మ పండగలో చిన్నారులు, యువతులు, మహిళలు భాగస్వాములవుతారు. తొమ్మిది రోజులు ఆడిపాడుతూ బతుకమ్మ చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. ఈ క్రమంలో పూల నుంచి వెలువడే సువాసనలు, వాటి స్పర్శ మహిళల ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని ఆయుర్వేద వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఈ ఉత్సవంలో ఆహ్లాదంతో పాటు ఆరోగ్యం దాగి ఉందని శాస్త్రీయంగా రుజువైన నేపథ్యంలో 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

బంతిపూలు

బంతిపూల సుగంధ వాసన జలుబు నుంచి ఉపశమనాన్ని కలిగిస్తుంది. కడుపులోని నులి పురుగుల వ్యాధి నివారణకు వాడతారు. ఈ పూల తైలం రక్తస్రావం తగ్గడానికి, కేశాలు పెరగడానికి ఔషధంగా ఆయుర్వేద వైద్యంలో ఉపయోగిస్తారు.

చామంతి

చామంతి పూలతో చర్మ సమస్యలు దూరమవుతాయి. జ్వరం, కీళ్ల నొప్పులు తగ్గడానికి దోహదం చేస్తాయి. నిద్రలేమి, ఒత్తిడిని తగ్గిస్తాయి.

కాకర పూలు

కాకర కాయ, వాటి పూలు మధుమేహ వ్యాధిగ్రస్థులకు దివ్యౌషధంగా పని చేయడమే కాకుండా వారి మానసిక స్థితిని ఉత్సాహంగా ఉంచుతుంది. యాంటిబయాటిక్స్ మందుల తయారీలో కాకర పూల తైలాన్ని ఉపయోగిస్తుంటారు. జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది.

గునుగు

ఈ పువ్వులను అతిసార, క్షయ వ్యాధుల నివారణకు ఔషధంగా వాడతారు. ఈ పూల పొడి పెద్ద పేగులోని బద్దె పురుగులను తొలగించడానికి, కంటి సంబంధ రోగ నివారణకు ఉపయోగిస్తారు. మధుమేహం, నోటి పుండ్లు, ముక్కులో రక్తస్రావం తగ్గడానికి ఉపయోగిస్తారు. రక్తపోటును అదుపులో పెడుతుంది.

తంగేడు

దీని ఆకులు, పువ్వుల చూర్ణాన్ని కామెర్లు, తామర లాంటి చర్మ వ్యాధుల నివారణకు ఉపయోగిస్తారు. చెక్కను ఉదరకోశ వ్యాధులకు మందుగా, కళ్లకలక నుంచి ఉపశమనం పొందడానికి ఉపయోగిస్తారు.

గడ్డిపువ్వు

గడ్డి పువ్వును ఆయుర్వేద వైద్యంలో యాంటిబయాటిక్‌గా వాడతారు. రక్తస్రావాన్ని నియంత్రించేందుకు ఇప్పటికీ మారుమూల గ్రామాల్లో, తండాల్లో, పల్లెల్లో ఈ పూలరసాన్ని ఉపయోగిస్తున్నారు.

గుమ్మడి

శరీర ఉష్ణోగ్రత సమతుల్యం ఉంచేందుకు వీటి పూలు ఆయుర్వేద వైద్యంలో వాడతారు. గుమ్మడి పువ్వు రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. ఈ పూలలో ఎ-విటమిన్ అధికంగా ఉండటంతో కంటి సంబంధిత రోగాలకు ఔషధంగా ఉపయోగిస్తారు. దగ్గు, జలుబు, వైరల్ జ్వరం తగ్గేందుకు వీటి పూలను మందుగా వాడతారు.

ఆరోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు దోహదం



- డా.అనికేత్ వైద్య, ఆయుర్వేద వైద్య నిపుణులు

బతుకమ్మలో వాడే పూలు మహిళల ఆరోగ్యాన్ని పెంపొందించడమే కాకుండా పర్యావరణాన్ని పరిరక్షిస్తాయి. ఆ పూలలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఆయుర్వేద వైద్యం తయారీలో వాటిని వాడతారు. మహిళలు బతుకమ్మల చుట్టూ ఆడే సందర్భంలో పూలనుంచి వచ్చే సువాసన, వాటి తాకిడితో జ్ఞానేంద్రియాలు ఉత్తేజితమవుతాయి. పూలను చూడటంతో కంటి చూపు బాగు పడుతుంది. ఏకాగ్రత పెరుగుతుంది. మానసిక ఒత్తిడి తగ్గుతుంది. ఈ నవరాత్రులు బతుకమ్మ ఆడే క్రమంలో వారికి తెలియకుండానే కొన్ని రుగ్మతలు వాటంతట అవే తగ్గిపోతాయి. వర్షాకాలంలో వాగులో, నదిలో కొత్త నీరు చేరుతుంది. సామూహికంగా బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేయడంతో హానికారక క్రిమికీటకాలు నశిస్తాయి. కొన్ని పూలు నీటిని శుద్ధి చేసి జలజీవులను బతికిస్తాయి. నైవేద్యాన్ని సమర్పించడంతో నీటిలోని జీవులకు అవి ఆహారంగా అవుతాయి.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, ఇన్‌ఛార్జి ఉపకులపతి వెంకటరమణ

వసతిగృహాల్లో సిబ్బంది కొరత

● ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ దృష్టికి ఆర్జీయూకేటీ సమస్యలు

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర ఆర్జీయూకేటీలోని సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య దృష్టికి తీసుకెళ్లారు. ఆర్జీయూకేటీని శుక్రవారం ఆయన సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ భోజనశాల నిర్వాహకులు పట్టిక పాటించడం లేదని, ఇష్టానుసారంగా భోజనం పెడుతున్నారని, గడువు ముగిసినా కొత్త నిర్వాహకులను ఏర్పాటు చేయడం లేదన్నారు. విశ్వవిద్యాలయంలో చీఫ్ వార్డెన్ శ్రీధర్ ప్రవర్తన బాగా లేదని వెంటనే మార్చాలని పలువురు విద్యార్థులు కమిషన్ ఛైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. విశ్వవిద్యాలయంలో 60 శాతం బాలికలున్నారని వారి వసతిగృహాల్లో కేర్ టేకర్ల(పోషకుల) కొరత ఉందన్నారు. అనంతరం పరిపాలన విభాగం కాన్ఫరెన్స్ హాల్‌లో ఇన్‌ఛార్జి ఉపకులపతి వెంకటరమణతో కలిసి అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. చీఫ్ వార్డెన్ సమావేశానికి ఆలస్యంగా రావడం, విద్యార్థులు పలు ఆరోపణలు చేయడంతో ఆయనపై కమిషన్ ఛైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనను తొలగించి నూతన వార్డెన్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. మిగిలిన సమస్యలు పరిష్కరించకపోవడంతో సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడి పరిస్థితులపై నివేదిక తయారు చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు అందజేస్తానని చెప్పారు. తహసీల్దార్ పవన్‌చంద్ర, ఎస్సై గణేశ్, విశ్వవిద్యాలయ పరిపాలన విభాగం అధికారి రణధీర్ తదితరులున్నారు.


రాష్ట్ర స్థాయి పోటీలకు పయనమైన ఉమ్మడి జిల్లా బాలుర జట్టుతో విద్యాధికారి యాదయ్య తదితరులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్లు

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే : పాఠశాల క్రీడా సమాఖ్య భద్రాద్రి కొత్తగూడెం, మెదక్ జిల్లాల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్లు పయనమయ్యాయి. అండర్-17 బాలబాలికల విభాగంలో శనివారం (బాలురు), ఆదివారం (బాలికలు) నుంచి పోటీలు ప్రారంభం కానుండగా ఆయా జట్ల క్రీడాకారులకు జిల్లా విద్యాధికారి యాదయ్య క్రీడా దుస్తులు అందజేశారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాంబమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయులు రామ్మోహన్, బెల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధి భాజపాతో సాధ్యం

దస్తూరాబాద్, న్యూస్‌టుడే: ప్రజలంతా భాజపా వైపు చూస్తున్నారని ఎంపీ జి.నగేష్ అన్నారు. శుక్రవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా దస్తూరాబాద్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. పల్లెల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ప్రజలంతా కాంగ్రెస్, భారాస పాలనలో విసిగిపోయారని, సభ్యత్వాలు విరివిగా చేసి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనంతరం రేవోజిపేట గ్రామానికి చెందిన కార్యకర్త బొమ్మెన రమేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాథోడ్ రితీష్, ఆకుల శ్రీనివాస్, కొడిమెల లక్ష్మణ్, వెంకటరమణ, సాగర్, రాజు, నాయకులున్నారు.


మాట్లాడుతున్న ఎంపీ నగేష్

ఇవీ జాగ్రత్తలు..



పోలీసులు, దర్యాప్తు సంస్థ ఏదైనా కేసు గురించి ఫోన్ ద్వారా ఆరా తీయవు. బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు వంటి వివరాలు సేకరించవు. కేసు నమోదవ్వకుండా ఉండాలంటే డబ్బు పంపించాలని చెబితే మోసమని గుర్తించాలి. ఎవ్వరికీ పార్సిల్ పంపకున్నా ఇతర దేశాలకు మీ పేరుపై వెళ్తోందంటే నమ్మొద్దు. వివిధ దర్యాప్తు సంస్థల పేర్లతో ఫోన్లు చేస్తే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. ఒకవేళ మోసపోయి డబ్బు కోల్పోతే టోల్‌ఫ్రీ 1930, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

'రెండు రోజుల క్రితం మంచిర్యాలకు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగికి దిల్లీ పోలీసుల పేర్లతో ఫోన్లు వచ్చాయి. మీ అబ్బాయిని సైబర్‌క్రైంలో అరెస్టు చేశాం. మా ఖాతాలోకి డబ్బులు జమ చేయాలంటూ చెప్పగా సదరు ఉద్యోగి తేరుకొని మా అబ్బాయి ఇంట్లోనే ఉన్నాడని సమాధానం చెప్పడంతో నిందితులు ఫోన్లు చేయడం ఆపేశారు.'

సైబర్ వల.. చిక్కితే విలవిల

● దిల్లీ, ముంబయి సైబర్‌క్రైం అధికారులమంటూ ఫోన్లు



సైబర్ నేరం జరిగితే బాధితులు వెంటనే సైబర్‌క్రైం రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ) 1930 కాల్‌సెంటర్‌లో ఫిర్యాదు చేస్తారు. అయితే ఆ కాల్‌సెంటర్, సైబర్‌క్రైం పోలీసుల పేరుతోనే మోసం జరిగితే.. సైబర్ నేరగాళ్లు ఇప్పుడు చేస్తుందిదే. గతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సీబీఐ, కస్టమ్స్ అధికారుల పేరుతో భయపెట్టి జనం డబ్బు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు కొంతకాలంగా రూటు మార్చారు. దిల్లీ, ముంబయి సైబర్‌క్రైం విభాగం, 1930 కాల్‌సెంటర్ అధికారులమంటూ వల విసురుతున్నారు.

-న్యూస్‌టుడే, మంచిర్యాల నేరవిభాగం, మందమర్రి పట్టణం,

మోసగిస్తారిలా..

డ్రగ్స్ పార్సిల్ కేసు దర్యాప్తులో భాగంగా అనుమానాస్పద లావాదేవీలు జరిగిన కొన్ని ఖాతాలు గుర్తించామని.. అందులో మీది ఉందంటూ ఫోన్ చేస్తున్నారు. అనుమానాస్పద లావాదేవీలు జరిగాయని, కొంత డబ్బు మీ ఖాతాలో జమయ్యిందంటూ వివరాలు సేకరిస్తున్నారు. కేసు దర్యాప్తుకు సెక్యూరిటీ డిపాజిట్ చేయాలని, మీ పాత్ర లేనట్లు తేలితే డబ్బు తిరిగి పంపిస్తామంటూ కొంత వసూలు చేస్తున్నారు.

'మందమర్రికి చెందిన ఓ ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్‌కు ఇటీవల పోలీసుల పేరుతో మాట్లాడి మీపై మనీ లాండరింగ్ కేసు ఉందని బెదిరించి విడతల వారీగా రూ. 1,43,75000 నిందితులు తమ ఖాతాలోకి జమ చేసుకున్నారు.'


మంచిర్యాలకు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగికి వచ్చిన ఫోన్‌కాల్స్ జాబితా

జడ్జిలకు పదోన్నతులు

● మరికొందరికి స్థానచలనం

ఎదులాపురం, మంచిర్యాల న్యాయవిభాగం, న్యూస్‌టుడే : తెలంగాణ హైకోర్టు రాష్ట్ర వ్యాప్తంగా 38 మంది జూనియర్ సివిల్ జడ్జిలకు సీనియర్ సివిల్ జడ్జిలుగా పదోన్నతులు కల్పిస్తూ, మరో 32 మందికి స్థాన చలనం కల్పిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో ఒకరు పదోన్నతి పొంది మరో జిల్లాకు బదిలీ అయ్యారు. ఇతర జిల్లాల నుంచి ఇద్దరిని ఉమ్మడి జిల్లాకు బదిలీ చేశారు.

న్యాయమూర్తి	ప్రస్తుత స్థానం	బదిలీ
పదోన్నతులు పొంది బదిలీ అయిన వారు		
మంజుల సూర్యవార్	జూనియర్ సివిల్‌జడ్జి ఆదిలాబాద్	సీనియర్‌సివిల్‌జడ్జి నకిరేకల్(నల్గొండ)
డి. రామ్మోహన్‌రెడ్డి	„ „ ములుగు	„ „ మంచిర్యాల
సి. సంపత్	„ „ మంచిర్యాల	„ „ మంచిర్యాల
స్థాన చలనం అయిన వారు		
జి. శ్రీనివాస్	సీనియర్ సివిల్ జడ్జి నారాయణపేట్	సీనియర్ సివిల్ జడ్జి నిర్మల్
గవ్వల రాధిక	„ „ నిర్మల్	డీఎల్ఎస్ఏ కార్యదర్శి నిర్మల్
అర్పిత మారంరెడ్డి	„ „ మంచిర్యాల	„ „ మంచిర్యాల

గుమ్మడి కాయంత పరిమాణం.. ద్రాక్షపండు రుచి


చెట్టుకు కాసిన పనర పనస పండ్లు

పెద్ద సైజులో ఉన్న ఈ కాయలను చూసిన వారు ఇవేమని ఆశ్చర్యపోతున్నారు. ఇది గోల్డెన్ బ్లూమ్ గ్రాఫ్టెడ్ పొమెలో ఫ్రూట్ లేదా పనర పనస లేదా గజ నిమ్మ అంటారు. ఇవి ఆగ్నేయ ఆసియా దేశాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. ఖానాపూర్ మండలం మస్కాపూర్ మధురానగర్ కాలనీకి చెందిన శ్రవణ్ తన ఇంట్లో అయిదేళ్ల కిందట నాటిన మొక్క పెద్దదై పండ్లను ఇస్తోంది. గుమ్మడికాయ సైజులో ఈ పండ్లు కాస్తాయని, ద్రాక్షపండు రుచిని పోలి ఉంటుందని శ్రవణ్ చెప్పారు. ఈ పండులో పొటాషియం, విటమిన్-సి పుష్కలంగా ఉంటాయని నిర్మల్‌కు చెందిన వృక్ష శాస్త్ర ఉపాధ్యాయుడు మోహన్‌రావ్ తెలిపారు. -న్యూస్‌టుడే, ఖానాపూర్

మేమున్నాం.. మీకు తోడుగా..

మంచిర్యాల: 98663 07290
చెన్నూరు: 98496 20143
బెల్లంపల్లి: 99496 20369
(10 AM TO 1 PM)

న్యూస్‌టుడే, నస్పూర్

? సీసీసీ కార్నర్ బస్టాండ్ వద్ద నిత్యం వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. బస్ షెల్టర్ లేక ఇబ్బందులు పడుతున్నాం. - స్థానికులు

✔ త్వరలోనే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.
- సతీష్, నస్పూర్ పుర కమిషనర్

కోటపల్లి, న్యూస్‌టుడే:

? కొల్లూర్ ఎస్సీ కాలనీలో రోడ్డుపై మురుగు పారుతోంది. దీంతో అపరిశుభ్రత నెలకొని వ్యాధులకు దారి తీస్తోంది. - బాపు, స్థానికుడు

✔ మురుగు కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరుకాగానే పనులు చేపడతాం.
- సుధాకర్, పంచాయతీ కార్యదర్శి

ఘనంగా పూజలు.. చండీహోమం



పూజలో పాల్గొన్న జీఎం బి.సంజీవరెడ్డి దంపతులు

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏరియాలోని శ్రీరాంపూర్-1, శ్రీరాంపూర్-3, 3ఏ గనుల్లో అమ్మవారికి జీఎం బి.సంజీవరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విధి నిర్వహణలో ఉద్యోగులకు అమ్మవారికి ఆశీస్సులు ఉండాలని ఆయన కోరారు. ఏజెంట్ గోపాల్‌సింగ్-రష్మి సింగ్ దంపతులు, గుర్తింపు సంఘం ఏరియా సహాయ కార్యదర్శి కొమురయ్య, గని మేనేజర్ వెంకట్రావు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్ : మందమర్రి ఏరియా ఆర్కే1ఏ గని మైసమ్మ ఆలయంలో శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఆర్కేపీ ఓసీ పీఓ గోవిందరావు-శ్రీవాణి దంపతులు చండీహోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

మందమర్రి పట్టణం: పకడ్బందీగా దసరా ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మందమర్రి జీఎం దేవేందర్ అన్నారు. శుక్రవారం మందమర్రి స్థానిక జీఎం కార్యాలయంలో గుర్తింపు సంఘం నాయకులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ 12న సింగరేణి పాఠశాల మైదానంలో అట్టహాసంగా వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఓటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పీఎం శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం దేవేందర్



ఒప్పంద కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే : సంస్థలోని ఒప్పంద కార్మికుల సమస్యలు పరిష్కరించాలని హెచ్ఎంఎస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం మందమర్రి ఏరియా ఆర్కేపీ సీహెచ్‌పీలో కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి కాంట్రాక్టు కార్మికునికి దీపావళి బోనస్ 8.33 శాతం ఇవ్వాలని కోరారు.

బీఎంఎస్‌పై పెరుగుతున్న ఆదరణ

శ్రీరాంపూర్ గ్రామీణం : సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్(బీఎంఎస్)పై కార్మికుల్లో రోజురోజుకు ఆదరణ పెరుగుతుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు కార్మికులు బీఎంఎస్‌లో చేరారు. సీఎంపీఎఫ్‌లో జరిగిన రూ.1000 కోట్ల కుంభకోణంపై సీబీఐతో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, రాజేందర్, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

గుర్తింపు సంఘాల వైఫల్యంతో అన్యాయం

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే : కార్మికులకు లాభాల వాటా చెల్లింపులో అన్యాయం జరిగిందని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రవీంద్రఖని-7 గని వద్ద ద్వార సమావేశంలో మాట్లాడారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల వైఫల్యంతోనే అన్యాయం జరిగిందన్నారు. పూర్తి స్థాయి వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6న గోదావరిఖనిలో దీక్ష చేయనున్నట్లు పేర్కొన్నారు ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, లక్ష్మణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య

ఏఐటీయూసీ కృషితో లాభాల వాటా

కాసిపేట, న్యూస్‌టుడే : మొదటి నుంచి తమ సంఘం కృషితో కార్మికులకు లాభాల వాటా అమలు అవుతుందని, కొందరు తమ సంఘంపై లేనిపోని దుష్ప్రచారం చేస్తున్నారని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. మందమర్రి ఏరియాలోని కాసిపేట గని 2లో శుక్రవారం నిర్వహించిన ద్వార సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రాంచి ఇన్‌ఛార్జి నరసయ్య, బ్రాంచి కార్యదర్శి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక కారణాలతో పింఛను చెల్లింపులో జాప్యం

శ్రీరాంపూర్ గ్రామీణం : సాంకేతిక కారణాలతో ఈ నెల పింఛను చెల్లింపులో జాప్యం ఏర్పడిందని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉపప్రధాన కార్యదర్శి వేణు మాధవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ప్రతినెల ఒకటో తేదీనే ఉద్యోగుల ఖాతాలో పింఛను జమ అవుతుందని, ఈ నెల 4 తేదీ వచ్చినా జమ కాకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై సంబంధిత అధికారులను సంప్రదించగా సాంకేతిక కారణాలతో కొందరికి పింఛను జమ కాలేదని, త్వరలోనే దీన్ని పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

చెన్నూరు మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త అరెస్ట్

జైపూర్, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించిన చెన్నూర్ పట్టణంలోని శనిగకుంట మత్తడి పేల్చివేత కేసులో పరారీలో ఉన్న మరో ముగ్గురు నిందితులను శుక్రవారం అదుపులోకి తీసుకున్నామని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ తెలిపారు. మండల కేంద్రంలోని ఏసీపీ కార్యాలయంలో చెన్నూర్ సీఐ రవీందర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. గత నెల 16న చెన్నూర్‌లోని శనిగకుంట చెరువు మత్తడిని గుర్తు తెలియని వ్యక్తులు పేల్చివేశారని నీటిపారుదలశాఖ అధికారులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. ఈ కేసులో మొత్తం 14 మంది నిందితులుగా గుర్తించి పలు దఫాలుగా 11 మందిని విచారించి అదుపులోకి తీసుకున్నారు. నేరస్థులు ప్రోత్సహించిన బత్తుల సమ్మయ్య(ఏ5), చెన్నూరు మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త రాంలాల్ గిల్డా(ఏ6)లతో పాటు కేసుకు సంబంధం ఉన్న ఎన్నం బానయ్య(ఏ14)లను చెన్నూర్‌లో అదుపులోకి తీసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్

వ్యక్తి అదృశ్యం కేసు నమోదు

పాలకుర్తి(రామగుండం), న్యూస్‌టుడే: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు రామగుండం పోలీసులు శుక్రవారం తెలిపారు. రామగుండం ఏఎస్సై సుద్దాల కరుణ తెలిపిన మేరకు.. మంచిర్యాల జిల్లా సీసీసీ నస్పూర్ మండలం శాఖలపల్లి ప్రాంతానికి చెందిన కందుగుల కుమార్ తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. కుమార్‌కు భార్య, ముగ్గురు సంతానం కాగా.. రామగుండం హౌజింగ్‌బోర్డుకాలనీలోని అమ్మమ్మ ఇంట్లో ఉంటూ చదువుకుంటుంది. గత నెల 20న కుమార్ భార్య విజయతో కలిసి కుమార్తెను చూడడానికి హౌజింగ్‌బోర్డ్ కాలనీకి వచ్చాడు. 28న ఇంటికి వెళ్తున్నానని చెప్పి కనిపించకుండా పోయాడు. ఎక్కడ ఆచూకీ లభించకపోవడంతో విజయ శుక్రవారం రామగుండం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

మహిళ హత్యకేసులో ఇద్దరి రిమాండ్

మంచిర్యాలనేరవిభాగం : జిల్లా కేంద్రంలోని స్థానిక మేదరవాడలో అనుమానాస్పదంగా మృత్యువాతపడిన విజయలక్ష్మిని ఆమె వారి కుటుంబసభ్యులే హత్య చేసినట్లు మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ తెలిపారు. శుక్రవారం రాత్రి తన కార్యాలయంలో కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. స్థానిక మేదరివాడకు చెందిన విజయలక్ష్మి(45)కి వారి బంధువులైన శ్రీకాంత్, లక్ష్మితో ఆస్తి తగాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే గత నెల 30న పరస్పర ఘర్షణ జరిగి పిన్ని అయిన విజయలక్ష్మిపై శ్రీకాంత్ దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. శ్రీకాంత్ తల్లి లక్ష్మితో పాటు నిందితుడిని శుక్రవారం మంచిర్యాలలో పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ తెలిపారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో ఫైనల్‌కు చేరిన ఉమ్మడి జిల్లా జట్టు

మంచిర్యాల క్రీడావిభాగం: నారాయణపేట జిల్లాలో పాఠశాల క్రీడా సమాఖ్య నిర్వహిస్తున్న 68వ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి(ఆదిలాబాద్)జిల్లా జట్టు సత్తాచాటుతోంది. అండర్-17 బాలికల విభాగంలో శుక్రవారం జరిగిన సెమీఫైనల్స్‌లో వరంగల్‌జిల్లా జట్టును 9-0గోల్స్ తేడాతో మట్టికరిపించి సునాయసంగా తుదిపోరుకు చేరారు. శనివారం ఫైనల్స్ జరగనున్నాయని, ఇందుకు జట్టు మరింత కసరత్తు చేస్తుందని ఎస్‌జీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు తెలిపారు.



ఫైనల్స్‌కు చేరుకున్న ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు సభ్యులు

బెల్లంపల్లి పట్టణం: రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు సెంట్రల్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీఓఈ) విద్యార్థి కె.భీమ్‌రావు ఎంపికయ్యాడు. పదో తరగతి చదువుతున్న అతను గత నెల 30న బొక్కలగుట్టలోని హెవెన్ ఆఫ్ హోప్ హైస్కూల్‌లో నిర్వహించిన జోనల్ స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున ఆడి ప్రతిభ చాటాడు. త్వరలో భద్రాది కొత్తగూడెం జిల్లాలో జరగనున్న అండర్-17 ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపల్ శ్రీధర్ అభినందించారు.

క్రికెట్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

మంచిర్యాల క్రీడావిభాగం: నిర్మల్ జిల్లాలో అండర్-14 బాలుర విభాగంలో జరిగిన జోనల్‌స్థాయి క్రికెట్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభచాటారు. మెరుగైన ఆటతీరుతో ఆకట్టుకుని త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మంచిర్యాలకు చెందిన వేములపల్లి లక్ష్మణ్‌సాయి, ఎడ్ల రిషికేష్‌చంద్ర, బింగి అర్జున్, పులిపాక వికాస్, సాయిగణేష్ ఎంపికైన వారిలో ఉన్నారు.

సర్వర్ లేక.. 'సదరం' నమోదుకు తిప్పలు

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే : సదరం ధ్రువీకరణ పత్రాల జారీ కోసం వికలాంగులు, దీర్ఘకాలిక రోగులకు సదరం స్లాటు నమోదుకు తిప్పలు తప్పడం లేదు. శుక్రవారం నుంచి మీసేవలో స్లాటు నమోదు ప్రక్రియ జరుగుతుందని జిల్లా అధికారులు ప్రకటన జారీ చేశారు. దీంతో మారుమూల ప్రాంతాల నుంచి వికలాంగులు మీ సేవలకు పరుగులు తీశారు. వ్యక్తి వేలిముద్రతో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి. కానీ సదరానికి సంబంధించిన వెబ్‌సైట్‌లో అంతరాయం ఏర్పడింది. ఉదయం వచ్చి సైటు ఎప్పుడు మొదలవుతుందా అని ఆశగా ఎదురుచూశారు. సాయంత్రమైనా సరికాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. దీనిపై డీఆర్డీఓ పీడీ కిషన్‌ను వివరణ కోరగా.. ఈ సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉందని, సైటు సరిగా ఉన్నప్పుడు మళ్లీ ప్రకటన ఇస్తామని పేర్కొన్నారు.



దండేపల్లి మీసేవలో స్లాటు కోసం వేచి చూస్తున్న ప్రజలు

ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా ఉండాలి

కాసిపేట, న్యూస్‌టుడే : పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చే ఫిర్యాదుదారులతో పోలీసులు స్నేహపూర్వకంగా మెలగాలని సీపీ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని దేవాపూర్ పోలీసు స్టేషన్‌ను శుక్రవారం సీపీ తనిఖీ చేశారు. కౌంటర్ రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పల్లె నిద్ర చేపట్టి, వారి సమస్యలను గుర్తించి, పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అడిషనల్ డీసీపీ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర, ఏసీపీ రవికుమార్ పాల్గొన్నారు.

అసలు దోషులను తప్పించారంటూ భారాస ఆందోళన

చెన్నూరు, న్యూస్‌టుడే : చెన్నూరు పట్టణంలోని శనిక్కుంట చెరువు మత్తడి పేల్చివేత కేసులో అధికార పార్టీకి చెందిన అసలు దోషులను తప్పించారని, తక్షణం వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం భారాస నాయకులు పట్టణంలో ఆందోళన చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి పాతబస్టాండ్ వరకు నిరసన ర్యాలీ చేపట్టి అంబేడ్కర్‌చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆందోళనకారులను పోలీసులు చెదరగొట్టే ప్రయత్నం చేయగా స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. పోలీసులకు భారాస నాయకులకు మధ్యతోపులాట జరగగా స్థానిక 9వ వార్డు కౌన్సిలర్ దోమకొండ అనిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. నాయకులు మాట్లాడారు. ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడైనందునే అధికార బలం ఉపయోగించి ఈ కేసుతో సంబంధం ఉన్నప్పటికీ దోషులను కేసు నుంచి తప్పించారని ఆరోపించారు. మున్సిపల్ వైస్‌ఛైర్మన్ నవాజోద్దీన్, కౌన్సిలర్లుపాల్గొన్నారు. చెన్నూరులో శనిక్కుంట మత్తడి ధ్వంసం కేసులో పోలీసులు వ్యవహరించిన తీరు సరైనదికాదని, అసలు దోషులను తప్పించి అమాయకులను కేసులో ఇరికించారని భారాస నాయకుడు రాజారమేశ్ ఆరోపించారు.



చెన్నూరులో ధర్నా నిర్వహిస్తున్న భారాస నాయకులు

మత్తడి పేల్చిన ఘటనలో పక్షపాత వైఖరి శోచనీయం

చెన్నూరు పట్టణం: శనగకుంట మత్తడి పేల్చిన ఘటనలో ప్రభుత్వం పక్షపాత వైఖరి ప్రదర్శించిందని, పోలీసులపై ఒత్తిడి తెచ్చి కాంగ్రెస్ పార్టీ నాయకులను కేసు నుంచి తప్పించారని భాజపా పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ ఆరోపించారు. శుక్రవారం చెన్నూరులోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మత్తడి పేల్చిన ఘటనలో లోతైన విచారణ చేయాలని భాజపా, భారాస నాయకులెవరున్నా.. కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొనడంతోనే పోలీసులు కాంగ్రెస్ నాయకులను పక్కనబెట్టి ఇతర పార్టీల సానుభూతిపరులపై కేసులు నమోదు చేశారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా బాంబులు పేలిన సంఘటనలను ఎన్ఐఏ విచారణ జరుపుతుందని, ఈకేసులో మాత్రం స్థానిక పోలీసులు విచారణ చేయడం అనుమానాలకు తావిస్తుందన్నారు. పార్టీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరుపతి, వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి భాజపాతో సాధ్యం : ఎంపీ నగేశ్

జన్నారం, న్యూస్‌టుడే : పల్లెల అభివృద్ధి భాజపాతోనే సాధ్యమని ఆదిలాబాద్ ఎంపీ జి.నగేశ్ అన్నారు. జన్నారంలో శుక్రవారం ఆయన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరయ్యారు. ఆ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ నాయకుడు రితేశ్ రాథోడ్, జన్నారం మండల అధ్యక్షుడు మధుసూదన్‌రావుతో కలిసి పలువురికి పార్టీ సభ్యత్వం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడారు. పార్టీ జిల్లా కార్యదర్శి శంకరయ్య, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అజ్మీర బద్రినాయక్, మండల ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జన్నారంలో మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎంపీ నగేశ్

నెన్నెల : నెన్నెలలో భాజపా మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. బెల్లంపల్లి అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్, పార్టీ మండల అధ్యక్షుడు శైలేందర్ సింగ్, నాయకులు కృష్ణమూర్తి, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

భూముల క్రమబద్ధీకరణకు ఎల్ఆర్ఎస్ సర్వే

భీమారం, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో భూముల క్రమబద్ధీకరణలో భాగంగా ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్ల స్థలాలను పంచాయతీ అధికారులు మొబైల్ యాప్ ద్వారా యజమాని వివరాలు, భూమి విస్తీర్ణం ఇతర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. భీమారంలో మొత్తం 316 దరఖాస్తులు రాగా తొలిరోజు శుక్రవారం 25 మంది వివరాల నమోదు పూర్తి చేసినట్లు పంచాయతీ అధికారి కృష్ణమూర్తి తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మొత్తాన్ని చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవాల్సి ఉంటుందని అన్నారు.

పండగ పూట దుకాణాలను కూల్చివేయడం సరికాదు

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే: పండగ పూట దుకాణాలను కూలగొట్టడంతో వ్యాపారులు గిరాకీ రాకుండా పోయిందని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆరోపించారు. ఈ నెల 3న మంచిర్యాలలో అక్రమ నిర్మాణాల పేరిట ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అధికారులతో కూల్చి వేయించిన దుకాణాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. వ్యాపారస్తుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేకు ఎవరు ఎదురు మాట్లాడినా తప్పుడు కేసులు పెట్టిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.



కూల్చివేసిన దుకాణాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

సకాలంలో స్పందించి.. వ్యక్తి ప్రాణాలు కాపాడి

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే : దండేపల్లి మండలం గూడెం గోదావరి నదిలో దూకి చనిపోతానని వచ్చిన వ్యక్తిని శుక్రవారం దండేపల్లి, లక్షెట్టిపేట బ్లూకోల్ట్ పోలీసులు సకాలంలో స్పందించి ఆయన ప్రాణాలను కాపాడారు. కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన నామసాని శ్రీకాంత్ అనే ఆటో డ్రైవర్ బెల్లంపల్లిలోని తన బంధువుల ఇంటికి వెళ్లాడు. అక్కడ గొడవ జరగడంతో ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి గూడెం గోదావరి నది వద్దకు వచ్చాడు. అక్కడి నుంచి బంధువులకు వీడియో కాల్ చేసి నదిలో దూకి చనిపోతున్నాని చెప్పాడు. కుటుంబీకులు 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే బ్లూకోల్ట్ సిబ్బంది అక్కడకు చేరుకొని శ్రీకాంత్‌ను పట్టుకొని కౌన్సిలింగ్ ఇచ్చారు. పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కుటుంబ సభ్యులను పిలిపించి అప్పగించారు. సకాలంలో నది వద్దకు చేరుకున్న పోలీసులు లక్ష్మయ్య, శేఖర్, బ్రహ్మం, రత్నాకర్, రాజులను లక్షెట్టిపేట సీఐ అల్లం నరేందర్ అభినందించారు.



గూడెం వద్ద కాపాడిన వ్యక్తితో బ్లూకోల్ట్ సిబ్బంది



బతుకమ్మ సంబురాల్లో జడ్జిలు

మంచిర్యాల న్యాయవిభాగం, నస్పూర్, న్యూస్‌టుడే : తెలంగాణ సంస్కృతికి ప్రతి రూపంగా నిలిచే బతుకమ్మ వేడుకలు శుక్రవారం మంచిర్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల కోర్టు సముదాయంలో 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో' అంటూ మహిళ జడ్జిలు, న్యాయవాదులు, సిబ్బంది బతుకమ్మలతో ఆడుతూ పాడుతూ సంతోషంగా గడిపారు. జిల్లా న్యాయసేవా కార్యదర్శి అర్పిత మారంరెడ్డి, సీనియర్ సివిల్ జడ్జి సంపత్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ తదితరులు పాల్గొన్నారు.

పొరపాట్లు లేకుండా వివరాల నమోదు

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుటుంబ డిజిటల్ కార్డుల జారీకి సంబంధించి ఇంటింటి సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన దండేపల్లి మండలం అల్లీపూర్ పంచాయతీలో చేపట్టిన సర్వే తీరును శుక్రవారం ఆయన పరిశీలించారు. కశపల్లి గ్రామంలో లోవోల్టేజీ సమస్యతో బాధపడుతున్నామని రైతులు పేర్కొనగా విద్యుత్తు శాఖ ఎస్ఈతో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అల్లీపూర్‌లో సర్వే తీరును పరిశీలిస్తున్న కలెక్టర్

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ఏసీసీ: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పోలీస్, ట్రాఫిక్, రవాణా, ఆబ్కారీ, పుర కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పురపాలికల పరిధిలో రహదారులపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని, మూలమలుపుల వద్ద సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. షాపింగ్ మాల్స్, బహుళ అంతస్థుల భవనాల్లో తప్పనిసరిగా పార్కింగ్ స్థలాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వెలగని వీధి దీపాలపై దృష్టి సారించాలన్నారు. వీధి విక్రయదారులు రోడ్లపై కూరగాయలు, ఇతర వ్యాపారాలు జరపకుండా ప్రత్యేక స్థలాలు కేటాయించాలన్నారు. రోడ్లపై పశువుల సంచారాన్ని నియంత్రించాలని, అవసరమైతే యజమానులకు జరిమానా విధించాలని సూచించారు.

పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి

తాండూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం తాండూరు మండల పరిధిలోని కిష్టంపేట ప్రభుత్వ పాఠశాలలో రూ.5 లక్షలు, నర్సాపూర్ పాఠశాలలో రూ.7 లక్షలు, బెజ్జాలలో రూ.2 లక్షల ఉపాధిహామీ నిధులతో ప్రహరీ నిర్మాణ పనులు అధికారులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బానయ్య, నాయకులు పాల్గొన్నారు.



ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

పరిహారానికి రెండేళ్లుగా ఎదురు చూపులు

మొదటి చిత్రంలో ఉన్న పొలంలో 2022లో వచ్చిన గోదావరి వరదలకు ఇసుక మేటలు వేసింది. అప్పట్లో అధికారులు సర్వేలు సైతం చేశారు. ఎన్నో కష్టాలకు ఓర్చి ఇసుకను తొలగించిన రైతు ప్రస్తుతం సాగు చేస్తున్నారు. రెండో చిత్రంలో ఉన్నది అప్పటి ఇసుక మేటలు వేసిన ఇప్పటి పచ్చని పంట పొలం. జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన రైతు ఆరె సత్యనారాయణకు చెందిన పొలం. ఇదీ ఒక్క సత్యనారాయణ పరిస్థితే కాదు జిల్లాలో గోదావరి పరీవాహక ప్రాంతంలో ఉన్న ప్రతి రైతు దయనీయ పరిస్థితికి ఇదే నిదర్శనం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నివేదికలను ప్రభుత్వానికి పంపించి పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, జన్నారం



2022లో ఇసుక మేటలు వేసిన పొలం



ప్రస్తుతం ఇలా

సంక్షిప్తం

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

చెన్నూరు : చెన్నూరు పట్టణం టౌన్-1 ఫీడర్ పరిధిలోని పాత సినిమా థియేటర్ ప్రాంతంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్తుశాఖ అధికారులు తెలిపారు.

రాయితీ సిలిండర్ పత్రాల అందజేత

దండేపల్లి గ్రామీణం : దండేపల్లి మండలం తాళ్లపేట గ్రామ పంచాయతీలో రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ సిలిండర్‌కు సంబంధించిన పత్రాలను శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సతీష్, మాజీ ఉప సర్పంచి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

వేమనపల్లి : మండలంలోని ముల్కలపేట, దస్నాపూర్ గ్రామాలకు చెందిన పలువురు మాజీ ఎంపీపీలు, వార్డు సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే వినోద్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు సంతోశ్‌కుమార్, మండల అధ్యక్షుడు సాబీర్‌అలీ పాల్గొన్నారు.

ఇద్దరి బైండోవర్

భీమారం: మండల కేంద్రంలో ప్రభుత్వ భూమి నుంచి రాత్రి సమయాలలో జేసీబీ, ట్రాక్టర్ల సహాయంతో అక్రమంగా మట్టి తరలింపునకు పాల్పడుతున్న మెండె పున్నం, బోల్లం శ్రీనివాస్‌లను తహసీల్దార్ సదానందం ఎదుట రూ.5 లక్షల పూచీకత్తుతో బైండోవర్ చేసినట్టు ఎస్సై రాములు తెలిపారు.

మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

కాసిపేట : కాసిపేట మండలంలోని ముత్యంపల్లి అంబేడ్కర్ మైదానంలో సీనియర్ క్రీడాకారుడు పెంజర్ల లక్ష్మణ్ స్మారకార్థం శుక్రవారం మండల స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు.

సమగ్ర ఆరోగ్య ప్రచారం

మంచిర్యాల సిటీ : జిల్లాలో 'దిశ' నిర్వహిస్తున్న సమగ్ర ఆరోగ్య ప్రచార కార్యక్రమం జిల్లాలో కొనసాగుతోంది. శనివారం పాతమంచిర్యాల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై సంబంధిత విభాగం సిబ్బంది అవగాహన కల్పించారు.

వన్య ప్రాణులను సంరక్షించుకోవాలి

తాండూరు, నెన్నెల : వన్య ప్రాణులను సంరక్షించుకోవాలని అటవీశాఖ డిప్యూటీ రేంజర్ తిరుపతి అన్నారు. వన్య ప్రాణి వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం తాండూరు మండల పరిధిలోని మాదారం అటవీశాఖ కార్యాలయంలో అవగాహన సదస్సును నిర్వహించారు. నెన్నెలలో రేంజ్ అధికారి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెసరపంట సాగుతో లాభాలు

కోటపల్లి: ప్రాణహిత వరదల నేపథ్యంలో నష్టపోయిన పంటల స్థానంలో తిరిగి పెసరపంట సాగుచేయడం ద్వారా లాభాలు గడించవచ్చని (ఐకార్‌క్రీడా) నోడల్ అధికారులు డా. టీవీ ప్రసాద్, డా. వెంకట్ సూచించారు. ఎస్సీ ఉప ప్రణాళిక కింద కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ, హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం కోటపల్లి మండలం రాపన్‌పల్లి, అర్జునగుట్ట, మల్లంపేట్ గ్రామాల్లోని ఎస్సీ రైతులకు వంద శాతం రాయితీపై పెసర విత్తనాలను పంపిణీ చేశారు.

శస్త్రచికిత్సలతో ప్రసవాలు తగ్గించాలి

మంచిర్యాల వైద్యవిభాగం: ప్రైవేటు ప్రసూతి ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు తగ్గించి, సాధారణ ప్రసవాలకు మొగ్గుచూపాలని జిల్లా వైద్యాధికారి హరీశ్‌రాజ్ అన్నారు. శుక్రవారం పాలనాధికారి కార్యాలయ సముదాయంలో సంబంధిత వైద్యురాళ్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని చిన్నారుల్లో రక్తహీనతను నివారించాలని, 5-9ఏళ్ల పిల్లలందరికీ ఎప్పటికప్పుడు రక్తపరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారి హరీశ్‌రాజ్ అన్నారు. ఎనీమియా ముక్త్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా శనివారం తన కార్యాలయంలో పీఓలు అనిల్, అనిత, కృపాబాయి, ఫయాజ్‌ఖాన్‌తో కలిసి ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు.